క్లుప్తంగా

ప్లాంటేషన్ పరిశీలన



ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

దౌల్తాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మాటూరు గ్రామంలో మొక్కలు నాటడానికి తవ్విన ప్లాంటేషన్‌ను పరిశీలించారు. తవ్విన గుంతల్లో త్వరలో మొక్కలు నాటాలని ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శికి సూచించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని తెలిపారు.

ఉపాధ్యాయురాలిగా మారిన ఎంపీడీఓ



చిన్నారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

దౌల్తాబాద్: ఎంపీడీఓ విజయలక్ష్మి గురువారం మండలంలోని మాటూరు గ్రామంలో వనమహోత్సవం, గ్రామాభివృద్ధి పనుల్లో భాగంగా తనిఖీలకు వెళ్లారు. ఈ క్రమంలో గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం చిన్నారులతో కొంతసేపు ముచ్చటించారు. అలాగే, కాసేపు ఉపాధ్యాయురాలిగా మారి వారికి బోధన చేశారు. ప్రతి విద్యార్థి బడిలో చేర్పించే లా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ సొంత భవనం నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు.

నిజాయితీ చాటుకున్న విద్యార్థినులు



డబ్బులు ఇస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థినులు

పరిగి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆశాజ్యోతి, గౌరీ గురువారం కళాశాల నుంచి ఇంటికి వెళ్తుండగా తుంకుల్‌గడ్డ గేటు దగ్గర వారికి రూ.30వేలు దొరికాయి. దీంతో విద్యార్థినులు కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌కు డబ్బులు దొరికాయని అందజేశారు. చిగురాల్‌పల్లికి చెందిన జహంగీర్ డబ్బులు పోగొట్టుకున్నారని తెలుసుకుని ఆయనకు అందజేశారు. విద్యార్థినిలను ఆధ్యాపకులు అభినందించారు.

విద్యతోనే ఉన్నత స్థాయికి..



సాంస్కృతిక కార్యక్రమంలో ఎంపీడీఓ

కుల్కచర్ల: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదవాలని అన్నారు. జీవితంలో పదవ తరగతి అనేది మొ దటి మెట్టులాంటిదని, కావున, ఎవరూ నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వొద్దన్నారు. అనంతరం కేజీబీవీలో కొనసాగుతున్న శిక్ష సప్తాహ సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ పాల్గొన్నారు.

ఆరోగ్యంతో చెలగాటం



పోతురాజుల వేషధారణలో చిన్నారుల డ్యాన్సులు

కుల్కచర్ల: ఇతర పాఠశాలల కంటే తమ పాఠశాల గొప్ప అని నిరూపించుకునేందుకు ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. గురువారం మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాల బోనాల జాతర నిర్వహించే క్రమంలో డీజే ఏర్పాటు చేసి విద్యార్థులతో బురదమయంగా ఉన్న రోడ్లపై డ్యాన్సులు చేయిస్తూ ర్యాలీ చేశారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షంలో విద్యార్థుల చేత ఇలా చేయించడంపై తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేసింది. ఈ విషయమై ప్రిన్సిపల్ అర్చనను వివరణ కోరగా బోనాల పండగ విశిష్ఠతను విద్యార్థులకు తెలియజేసేందుకే నిర్వహించామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల అనుమతులు తీసుకున్నామని చెప్పారు.

ఎదురుచూపులు ఫలించేనా?

చాలీచాలని వేతనాలు, పనిభారంతో సతమతమవుతున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు క్రమబద్ధీకరణ కోసం పోరాటం చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. పదిహేనేళ్లుగా వెట్టిచాకిరి చేస్తున్న వీరికి ఎన్నికల సమయంలో పలు పార్టీల నాయకులు న్యాయం చేస్తామని హామీలు ఇస్తూనే వచ్చారు. హామీలు నెరవేరకపోవడంతో మూడు రోజుల నుంచి వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు.

- పదిహేనేళ్లుగా విధుల నిర్వహణ
- అరకొర జీతంతోనే కాలం వెళ్లదీస్తున్న వైనం
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా న్యాయం జరిగేనా!
- జిల్లాలో 728 మంది సమగ్ర శిక్షా ఉద్యోగులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధిని పెంపొందించేందుకు వివిధ రూపాల్లో ఉద్యోగులను నియమించుకుని విద్యాశాఖ కృషి చేస్తోంది. అందులో భాగంగా క్లస్టర్ రిసోర్స్‌పర్సన్, ఇనక్లీసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్, ఎంఐఎస్ కోఆర్డినేటర్స్, ఆపరేటర్స్, మెసెంజర్స్, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్, టెక్నికల్ అనలిస్టులు, క్రాఫ్ట్, కేజీబీవీలో స్పెషల్ ఆఫీసర్స్, సీఆర్టీ, పీజీసీ ఆర్టీలు, స్కావెంజర్స్, కుక్స్ వంటి ఉద్యోగాలలో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగులను నియమించుకుని వారితో పనిచేయించుకుంటున్న పరిస్థితి నెలకొంది. వీరు గత 15సంవత్సరాలుగా పనిచేస్తున్నా క్రమబద్ధీకరణకు ఎదురుచూపులు తప్పడం లేదు.

జిల్లాలో 728 సమగ్ర శిక్షా ఉద్యోగులు

ప్రతి మండలంలో పాఠశాలలకు మండల విద్యావనరుల కేంద్రానికి అనుసంధానంగా పనిచేసేందుకు సీఆర్టీలు, సమాచార సరఫరా, వస్తువుల సరఫరా తదితర కార్యక్రమాలకు మెసేంజర్‌లు, జీతాల నిర్వహణ, ఆన్‌లైన్‌లో జిల్లా అధికారులతో సమన్వయం చేసేందుకు కంప్యూటర్ ఆపరేటర్లు పనిచేస్తారు. ఇలా కుల్కచర్ల మండలంలో సూమారు 25మంది ఉద్యోగులు పనిచేస్తుండగా జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల పరిధిలో 728మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.



ఉద్యోగుల నిరసన (ఫైల్)

ఉద్యోగ భద్రతే లక్ష్యం

తమకు భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రకారం సమానపనికి సమానవేతనం, ఉద్యోగ భద్రతను కల్పించాలని వారు కోరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నేతలు ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఒక అరగంటలో పరిష్కారమైయ్యే సమస్యను ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమంటూ మద్దతు పలికారు. కానీ, ప్రస్తుతం ప్రభుత్వ ప్రతినిధులు తమను పట్టించుకోవడం లేదని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో మరోమారు ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు

సమగ్రశిక్షా అభియాన్ పరిధిలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత, రెగ్యులరైజేషన్, కనీస వేతన స్కీంను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తారో తమకు అలాంటి సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు. ప్రతీ ఉద్యోగికి 10లక్షల బీమా వర్తింపజేయాలంటున్నారు. విద్యాశాఖ చేపట్టే నియామకాలల్లో తమకు వెయిటేజీని కలిెంచాలని, తద్వారా తమకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందని కోరుతున్నారు.

నిరసన తెలియజేస్తాం



సంవత్సరాల తరబడి ఉద్యోగ భద్రత కల్పించాలని పోరాటం చేస్తున్నా తమను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సమగ్ర శిక్షా ఉద్యోగుల ధర్నాలో పాల్గొని మీకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కావునా తమను గుర్తిస్తుందన్న నమ్మకంతో ఉన్నాం. ప్రభుత్వం తమను పట్టించుకోని పక్షంలో ఉద్యమ చేస్తాం.

– గాంగ్యనాయక్, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఆవేదన అర్థం చేసుకోండి



క్షేత్రస్థాయిలో విద్యార్థుల ఉన్నతికి పని చేస్తే మాపై ప్రభుత్వం మానవతాదృక్పథంతో ఆలోచించాలి. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే ఉద్యోగాన్ని నమ్ముకుని బతుకుతున్నాం. తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తే బాగుంటుంది. మా ఉద్యోగుల ఆవేదను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి.

– స్వప్నరెడ్డి, కేజీబీవీ ఉద్యోగి, జిల్లా మహిళా అధ్యక్షురాలు

జేఈ వ్యాక్సినేషన్ తప్పనిసరి

పబ్లిక్ హెల్త్ నర్స్ అరుణకుమారి

దోమ : చిన్నారులకు మెదడువాపు వ్యాధి సోకకుండా జేఈ (జపనీస్ ఎన్సెఫాలిటీస్) వాక్సినేషన్ తప్పనిసరిగా వేయించాలని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లాల్యానాయక్, మండల వైద్యాధికారి రజిత అన్నారు. గురువారం మండల పరిధిలోని కిష్టాపూర్ పాఠశాలలో 280 మంది చిన్నారులకు వైద్య సిబ్బంది జేఈ వ్యాక్సినేషన్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తొమ్మిది నెలలు పూర్తయిన చిన్నారుల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు జేఈ టీకా తప్పనిసరిగా వేయించాలన్నారు. ముఖ్యంగా మెదడువాపు అనేది తలనొప్పి, జ్వరం, వాంతులు, మతిస్థిమితం తప్పడం, అపస్మారక స్థితిలో ఉండడం, మూర్చ కదలిక లోపలు రావడం వంటి లోపాలు ఉన్నట్లయితే వేస్తారని తెలిపారు. మెదడువాపు రాకుండా నివారణ చర్యలు చేసేందుకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు జేఈ వ్యాక్సిన్ వేస్తున్నా మని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

1798 మంది చిన్నారులకు జేఈ టీకాలు

పెద్దేముల్: మెదడు వాపు వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తగా చిన్నారులకు జేఈ వ్యాక్సిన్ టీకాలు వేయటం జరుగుతుందని (పీహెచ్‌యన్) పబ్లిక్ హెల్త్ నర్స్ అరుణకుమారి తెలియజేశారు. గురువారం మండలంలోని పెద్దేముల్ , గోట్లపల్లి మోడల్ స్కూల్, అడ్కిచెర్ల, తట్టెపల్లి, కందనెల్లి, మంబాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో 1798 మంది చిన్నారులకు వ్యాక్సినేషన్ టీకాలు వేయడం జరిగిందన్నారు. తొమ్మిది నెలల పూర్తి అయిన చిన్నారుల నుంచి 15సంవత్సరాలలోపు చిన్నారులకు వ్యాక్సినేషన్ వేశామన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు స్వప్న, వెంకటలక్ష్మి, వెంకటమ్మ, కవిత, సుజాత, శీరిష, నర్సుబాయి, సునిత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



దోమ : వ్యాక్సినేషన్ వేస్తున్న వైద్య సిబ్బంది

కుల్కచర్లలో..

కుల్కచర్ల: మెదడువాపు వ్యాధిని నివారణకు జేఈ వ్యాక్సిన్ (జెపనీస్ ఎన్సెపలైటీస్)ను ఇస్తున్నామని మండల ప్రభుత్వ వైద్యురాలు మాధురి అన్నారు. బండవెల్కిచర్ల, ముజాహిద్‌పూర్ గ్రామాల్లో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు వ్యాక్సినేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 9నెలల నుంచి 5సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు టీకాలు వేస్తున్నామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు వైద్యులను సంప్రదించి టీకాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్, పల్లె దవాఖాన డాక్టర్ ప్రశాంతి, హెల్త్ అసిస్టెంట్ వెంకట్, వైద్య సిబ్బంది ఉన్నారు.

కాగడాల ప్రదర్శన

అనంతగిరి: కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన భారత సైనికులకు నివాళులర్పిస్తూ గురువారం వికారాబాద్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఎంఆర్‌పీ చౌరస్తా నుంచి బీజేఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌రెడ్డి, బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు కేపీరాజు, వడ్లనందు, సతీష్, రాజేందర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, అనిల్, శరణ్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న బీజేపీ నాయకులు

సీఎం సహాయనిధి వరం



మోమిన్‌పేట: చెక్కులను అందిస్తున్న శంకర్ తదితరులు

మర్పల్లి: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న నిరుపేదకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మల సురేష్ అన్నారు. గురువారం వికారాబాద్ మండల కేంద్రంలో శాసన సభ స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. సహకారం సంఘం అధ్యక్షుడు ప్రవీన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఫసియోద్దీన్, బ్లాక్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడె ఖలీమొద్దీన్, దివాకర్, పాండురంగారెడ్డి, రాములు, జాఫర్, సలీం, వెంకట్, రాచన్న, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో పలు గ్రామాలకు చెందిన 15మంది లబ్ధిదారులకు రూ.5లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆస్పత్రిలో మెరుగైన చికిత్స కోసం సీఎం సహాయనిధి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఆరోగ్య శ్రీ కూడా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మహేందర్‌రెడ్డి, సురేందర్, వెంకటయ్య, మహేందర్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఏరాజ్, ఎజాజ్ తదితరులు ఉన్నారు.



చెక్కులు అందజేసిన కాంగ్రెస్ నాయకులు

చెక్కుల పంపిణీ

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 20మంది లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందన్నారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శివరాం నగర్ కాలనీలో గురువారం బోనాల పండుగ ఘనంగా జరుపుకొన్నారు. ఈ మేరకు కాలనీలోని మహిళలు బోనాలతో ఎత్తగా ఉత్సవ ర్యాలీలో జోగిని పావని పాల్గొని బోనం ఎత్తారు. ఈ ఉత్సవంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం వికారాబాద్ అధ్యక్షుడు లక్ష్మణ్ గుప్తా, జిల్లా బీజేపీ అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర నాయకులు శివరాజు, కార్యదర్శి శ్రీకాంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పండుగ

వికారాబాద్ పట్టణంలోని వివేకవాణి విద్యాలయంలో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు బోనాలు ఎత్తుకొని, అబ్బాయిలు పోతురాజుల వేషంలో అలరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గాయత్రీ లక్ష్మణ్ , పాఠశాల ప్రిన్సిపల్ నాగయ్య, మాజీ కౌన్సిలర్ నాగయ్య, నాయకులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: వివేకవాణి విద్యాలయంలో..



బోనాల ఉత్సవంలో మాధవరెడ్డి తదితరులు



జోగిని పావని కోలాహలం

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటి నీరు పోస్తున్న మహేశ్‌బాబు

ఎంపీడీఓ మహేశ్‌బాబు

దోమ : ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణకు దోహదపడాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని దొంగఎన్కేపల్లి గ్రామంలో ఉపాధిహామీ కూలీలు, గ్రామస్తులతో కలసి మొక్కలను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనమహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని చెప్పారు. అనంతరం ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ సోమలింగం, పంచాయతీ కార్యదర్శి రాజేశ్, ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు, స్కూల్ కమిటీ చైర్మన్ మౌనిక, టెక్నికల్ అసిస్టెంట్, టీఏ, ఉపాధిహామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్సు నడపాలంటూ ధర్నా

యాలాల: ఉదయం, సాయంత్రం సమయాల్లో గ్రామాలకు వచ్చే బస్సు రాకపోవడంతో విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. మండల పరిధిలోని హాజీపూర్, కిష్టాపూర్ గ్రామాల విద్యార్థులు యాలాల మండల కేంద్రానికి చదువు నిమిత్తం వెళ్తుంటారు. గతంలో తాండూరు నుంచి కొత్తూరు వెళ్లే బస్సు కిష్టాపూర్, హాజీపూర్ గ్రామాల మీదుగా వెళ్లేది. ఇటీవల బస్సు వయా గ్రామాలకు వెళ్లడం లేదు. దీంతో సాయంత్రం పాఠశాల నుంచి తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు పడుతున్నామని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గురువారం హాజీపూర్ గేటు సమీపంలో ప్రధాన రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మా గ్రామాలకు బస్సు సర్వీసు వచ్చేలా చూడాలని కోరారు.



ధర్నా చేస్తున్న విద్యార్థులు

వ్యవసాయ పనులకు బ్రేక్

ధారూరు: ముసురు వాన ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా పడుతుండటంతో ప్రజలు, రైతులు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. గతవారం రోజు ల నుంచి వర్షం కురుస్తుండటంతో రైతులు ఎలాంటి వ్యవసాయ పనులు చేయలేకపోతున్నారు. ప్రస్తుతం పత్తి, కంది, పెసర, మినుము తదితర పంటల్లో కలుపు వచ్చిన తీయించలేకపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆర్ఐ రాజు బదిలీ

మోమిన్‌పేట: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు ఇటీవల జరిగిన బదిలీల్లో హైదరాబాద్‌కు వెళ్లారు. అలాగే, సబార్డినేట్ పాష కూడా బదిలీ అయ్యారు. ఇప్పటికే డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ పోస్టులు ఖాళీగా ఉన్నారు.

వర్షాలతో జాగ్రత్త



వర్షానికి కూలిన ఇంటి వద్ద బాధితుడు

మర్పల్లి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ గణేష్ సూచించారు. వివిధ గ్రామాల్లో పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కొత్లాపూర్‌కు చెందిన గొల్ల కిష్టయ్య, కోట మర్పల్లి వాసి జంగం నాగేశం, అల్లిపురం గోవింద్‌రెడ్డి, కల్కోడ ఉప్పునోళ్ల మైను, జోగి రాజు, సుంకి యాదవులు, సుజాతలు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. ప్రయాణాలు చేయాల్సి వస్తే వాగులు ఉన్న చోట తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండొద్దని చెప్పారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి

పరిగి: గతవారం రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న ముసురు వర్షంతో పట్టణ కేంద్రం మొత్తం అపరిశుభ్రంగా మారిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణాన్ని శుభ్రం చేయించి సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిసరాల అపరిశుభ్రతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నార. అస్తవ్యస్తంగా మారిన రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వర్షాలకు బీటీ రోడ్లు సైతం గుంతలమయంగా మారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కాలనీలను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంచందర్, రాముయాద్, కోళ్ల నర్సింహులు, ఆంజనేయులు, విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సంక్షిప్త వార్తలు

• తండా సమస్యలు తీరేదెన్నడు?

బొంరాస్‌పేట: తండాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేదెన్నడని లంబాడ హక్కుల పోరాట సమితీ (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 6176 గిరిజన గూడేల్లో గత ప్రభుత్వం 3,600 గ్రామపంచాయతీలుగా మార్చారని అన్నారు. ప్రస్తుతం గిరిజన తండాల్లో తాగునీరు, రోడ్డు, విద్యుత్ సమస్యలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజన తండాలపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

• డిజిటల్ లావాదేవీలపై అవగాహన

కుల్కచర్ల: విద్యార్థులు డిజిటల్ లావాదేవీలపై అవగాహనను పెంపొందించుకుని తమ తల్లిదండ్రులకు సూచించాలని ముజాహిద్‌పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ముజాహిద్‌పూర్ గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో లెర్నింగ్ లింక్స్, డెల్ టెక్నాలజీ వారి ఆధ్వర్యంలో సైబర్ విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి క్విజ్ పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తున్న క్రమంలో జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉంటుందన్నారు.

• బాధితుడికి పరామర్శ

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామానికి చెందిన బోయ శ్రీనివాస్‌కు బ్రేన్‌స్ట్రోక్ వచ్చింది. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు గురువారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. శ్రీనివాస్ ఆరోగ్యంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

• మంచి సమాజాన్ని నిర్మించాలి

పరిగి: ఉపాధ్యాయులతోనే మంచి సమాజం నిర్మాణం అవుతుందని నోడల్ అధికారి గోపాల్ అన్నారు. మండలంలోని సయ్యద్‌మల్కాపూర్ పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు గురువారం వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని, యువతను తీర్చిదిద్దేది ఒక ఉపాధ్యాయుని వల్లే సాధ్యమవుతుందన్నారు. కావునా, ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల భ్రమరాంబ, వీణా, దీపిక పాల్గొన్నారు.